క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



దేవరకొండ: శక్రుతండాలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

దేవరకొండ: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర క్యాంపు చైర్మన్ పీ.జే.శ్యాంసన్ కోరారు. గురువారం దేవరకొండ మండల పరిధిలోని శక్రుతండాలో క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరంలో భాగంగా దాదాపు 55మందికి కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఇడెం రాములు, మాకం చంద్రమౌళి, వనం శ్రీనివాసులు, పగిడిమర్రి రఘురాములు, ముశిని అంజన్, హరినాయక్, సీత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా పొందిన షేక్ జావిద్

వేములపల్లి : మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ కుమారుడు షేక్ జావిద్ తెలుగులో పీహెచ్‌డీ పూర్తి చేసినందుకుగాను డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె.చంద్రశేఖర్‌రావు పర్యవేక్షణలో ఓరియంటల్ తెలుగు విభాగం నుంచి తెలుగులో ముస్లింవాద సాహిత్యం సామాజిక వాస్తవికత అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకుగాను డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న జావిద్‌ను కుటుంబసభ్యులు, గ్రామస్తులతోపాటు ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ, నాయకులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, చిర్ర మల్లయ్యయాదవ్‌లు అభినందించారు.

రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా ధర్మానాయక్



ధర్మానాయక్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ గాజుల ప్రమీల

త్రిపురారం : రేషన్ డీలర్ల సంఘం త్రిపురారం మండల అధ్యక్షుడిగా కాపువారిగూడెం గ్రామానికి చెందిన డీలర్ నేనావత్ ధర్మానాయక్ ఎన్నికయ్యారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రేషన్ డీలర్ల సంఘం సమావేశంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చాపల అమిత్‌రెడ్డి, పనస దుర్గమ్మ, ప్రధాన కార్యదర్శిగా రేపాల నాగేశ్వరరావు, కోశాధికారిగా కొనకంచి రాంబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ధర్మానాయక్‌ను తహసీల్దార్ గాజుల ప్రమీల శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పలు గ్రామాల రేషన్ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



ఆదర్శ పాఠశాలలో శకుంతలను సన్మానిస్తున్న హిందీ పండిట్స్, ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్ : పైలాన్‌కాలనీలోని ఆదర్శ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన హిందీ పండిట్స్ కాంప్లెక్స్ సమావేశంలో ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన శకుంతలను హిందీపండిట్స్, ఆపాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. . ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ రాజబాబు, హిందీపండిట్స్ షరీఫ్, శ్రీదేవి, కృష్ణవేణి, ఆర్‌పీ, హరీశ్, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ చైర్మన్ కుటుంబానికి పరామర్శ



భార్గవ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ తల్లి తిరునగరు మల్లేశ్వరమ్మ ఈనెల 10న మృతి చెందింది. గురువారం ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు షాబునగర్‌లోని ఆయన నివాసంలో భార్గవ్‌ను పరామర్శించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసని నివాళులర్పించారు. ఆయన వెంట మహిమూద్, ఖాదర్, గోవింద్ రెడ్డి, బాబ్జీ తదితరులున్నారు.

నిర్వాసితుల సమస్యను పరిష్కరిస్తాం

- సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్
- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో దామరచర్ల మండలంలోని తాళ్ల వీరప్పగూడెం, వీర్లపాలెం, నర్సాపురం, తూర్పుతండా, దుబ్బతండా, శాంతినగర్ గ్రామాలకు చెందిన భూనిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి మాట్లాడారు. భూనిర్వాసితులు భూములు కోల్పోయిన అనంతరం యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. భూములు కోల్పోయిన వారికి పరిహారం అందించాలని కోరగా త్వరలోనే మీ సమస్యలను పరిష్కరించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, భూనిర్వాసితులకు సైతం పరిహారం అందిస్తామని ఆయన అన్నారు.



సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



భూనిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

సబ్ కలెక్టర్‌కు సన్మానం

మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను గురువారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కలిసి /జ్ఞాపిక అందించి స్వీటు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా విలేకరులు సబ్ కలెక్టర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. ఏడాదిలో విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి సహకరించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే ప్రతిపాదించిన పనులను వేగంగా చేసేలా సబ్ కలెక్టర్ సహకరిస్తూ వృత్తి ధర్మాన్ని పాటిస్తున్నార న్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు ఖాజా హమీదొద్దీన్, రంగా శ్రీనివాస్, ఎండి.అస్లాం, ఎండి.అయూబ్, ఖాజా నాజీమొద్దీన్, పి.యాదగిరి, కె.నాగాచారి, మందా సైదులు, బొంగరాల మట్టయ్య, గుండా మహేష్, టి.రాజారాం, వినయ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం.. ప్రభుత్వానికి రెండు కళ్లు

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పేర్కొన్నారు. జనహితలో భాగంగా చేపట్టిన మార్నింగ్ వాక్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమం గురువారం దేవరకొండ పట్టణంలో కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులతో కలిసి పలు వార్డుల్లో తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో పర్యటిస్తూ సంక్షేమ పథకాల అమలు తీరుని పర్యవేక్షించారు. రూ.3. 65కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అదే విధంగా అమృత్ 2.0 నిధులతో పట్టణ శివారులోని తులమ్మకుంట సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజా సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించే విధంగా జనహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అంతకు ముందు స్థానిక బాలికల వసతి గృహాన్ని సందర్శించి ఉదయం వారికి అందిస్తున్న అల్పాహారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, ఆలంపల్లి నర్సింహ, నల్లగాసు జాన్‌యాదవ్, నాయిని మాధవరెడ్డి, యూనూస్, తిరందాసు కృష్ణయ్య, పున్న వెంకటేశ్వర్లు, హన్మంతు వెంకటేష్‌గౌడ్, మారుపాకల సురేష్‌గౌడ్, వేణుధర్‌రెడ్డి, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు,అధికారులు పాల్గొన్నారు.



వసతి గృహంలో విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యేబాలునాయక్

హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గౌడ సంఘం నేతలు

మిర్యాలగూడ టౌన్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైన్స్ షాపుల కేటాయింపులో గౌడ్స్‌లకు 15శాతం కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ గురువారం తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లాడుతూ వైన్స్ టెండర్లల్లో గౌడకులస్తులకు 15శాతం నియోజకవర్గంలో కూడా ఇవ్వాలని కోరారు. ఈ 15 శాతం గౌడ కులస్తులకు ఇచ్చే కేటాయింపులో ఇతరులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో ఎమ్మెల్యేను కోరారు. అదే విధంగా ఈ 15శాతం టెండర్లల్లో కేవలం ఈ నియోజకవర్గానికి సంబంధించిన వారు మాత్రమే ఉండాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో సంఘం డివిజన్ అధ్యక్షుడు గుండు శ్రీరాములుగౌడ్, సురకారపు ఉదయ్ భాస్కర్ గౌడ్, పొలగాని వెంకటేష్, పెద్ది సైదులు గౌడ్, భాస్కర్, సైదులు గౌడ్, ఐతగోని సత్యం, పాండు గౌడ్, పొలగాని మహేష్ గౌడ్, అంతటి రాములు గౌడ్, వెంకన్న గౌడ్, చొగాని బిక్షం గౌడ్, ఏడుకోండలు, బెజవాడ దుర్గా ప్రసాద్,, ఈశ్వర్ గౌడ్, నాగయ్య గౌడ్ తదితరులున్నారు.

జర్నలిస్టు భాస్కర్ కుటుంబానికి ఆర్థిక సాయం

మిర్యాలగూడ టౌన్ : ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన జర్నలిస్టు దండ భాస్కర్ కుటుంబాన్ని గురువారం టీవీ5 బృందం పట్టణంలోని ఆయన నివాసంలో పరామర్శించింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ 1.40లక్షలను ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.

కార్మికులకు ఉపయోగపడేలా మొబైల్ ఎక్స్‌రే



మొబైల్ ఎక్స్‌రేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : కార్మికులకు ఉపయోగపడేలా ఎక్స్‌రేమిషన్ ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రైస్ అండ్ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ బహూకరించిన మొబైల్ ఎక్స్‌రేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని బాదలాపురంలో ఉన్న బాలాజీ రైస్ మిల్లులో పనిచేస్తున్న 30 ది కార్మికులకు ఎక్స్‌రేలు తీసి వారికి ఐదు నిమిషాల్లో రిపోర్ట్ అందించారు. ఈ మొబైల్ ఎక్స్‌రే ఏఐ టెక్నాలజీతో తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీను, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, గంట సతీష్‌రెడ్డి, రేపాల అంతయ్య, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రేపాల మధు, మోహిద్, ఆశా వర్కర్లు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- డీఈఓ భిక్షపతి

హాలియా : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి సూచించారు. గురువారం హాలియా పట్టణంలోని ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల, కేజీబీవీ, కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంటగది, సరుకులు, పరిసరాలు, స్టాక్ రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనంలో తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులను వినియోగించాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డెన్లు స్థానికంగా ఉంటూ హాస్టళ్లలోని పిల్లలను సొంత బిడ్డలుగా చూసుకోవాలని సూచించారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ గుండా కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

వేములపల్లి : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ సీఈఓ బి.శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండలంలోని ఆమనగల్లు జెడ్పీహైస్కూల్‌ను ఆయన సందర్శించి పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉన్నందున పాఠశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా విద్యాబోధన అందించాలని, పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దండ జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ హేమలత, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హాలియా : కేజీబీవీలో వంటగదిని పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి



వేములపల్లి : ఆమనగల్లు జెడ్పీహైస్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

రైతులకు యూరియా అందించి ఆదుకోవాలి

వేములపల్లి : మండలంలోని రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముందస్తు వర్షాలు పడి ప్రాజెక్టులోకి సమృద్ధిగా నీరు చేరడంతో రైతులు ఆశాజనకంగా వరిసాగు చేపట్టగా ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులకు సకాలంలో యూరియా అందకపోవడంతో మొదటి విడత యూరియా చల్లలేదన్నారు. దీంతో పంట ఎదుగుదల, దిగుబడిపై ప్రభావం చూపి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన యూరియాను అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రొండి శ్రీనివాస్, పాల్వాయి రాంరెడ్డి, వడ్డెగాని సైదులు, కోడిరెక్క వెంకన్న, నర్సింహారావు, ఎల్లయ్య, రేణయ్య, వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాదూరి శశిధర్‌రెడ్డి

యూరియా కోసం రైతులు పడిగాపులు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద గురువారం తెల్లవారు ఝాము నుంచి రైతులు క్యూ లైన్‌లో నిల్చున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు యూరియా కోసం తిండి తిప్పలు మాని కొంత మంది క్యూలో నిలిచి ఉండగా మరి కొంత మంది రైతు వేదిక వద్ద కూర్చున్నారు. రైతులు తెల్లవారు ఝాము నుంచి రైతు వేదిక వద్ద మధ్యాహ్నం వరకు ఎదురు చూసిన యూరియా రాకపోవడంతో రైతులు వెనుదిరిగారు.

వర్షంలోనూ యూరియాకోసం రైతుల ధర్నా

నిడమనూరు : యూరియా కోసం రైతులు గురువారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. నాలుగురోజులుగా నిడమనూరు సహకార సంఘానికి యూరియా రాకపోవడంతో రైతులు నిరసనకు దిగారు. పోలీసులు రంగంలోకి దిగి సహకార సంఘం సీఈఓ, వ్యవసాయాధికారులతో రైతులతో సంప్రదింపులు జరిపారు. శుక్రవారం నిడమనూరు సహకార సంఘానికి 100 టన్నులు(5 లారీలు) రానున్నట్లు రైతులకు వివరించారు. కూపన్లు కావాలని రైతులు డిమాండ్ చేయడంతో సహకార సంఘం వద్ద అందజేస్తామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.



అడవిదేవులపల్లి : రైతు వేదిక వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు



నిడమనూరు : రాస్తారోకో చేస్తున్న రైతులు

వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి



బొర్రాయిపాలెంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి శశికళ

త్రిపురారం : విద్యార్థులు వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ శశికళ అన్నారు. గురువారం మండలంలోని బొర్రాయిపాలెం, రాజేంద్రనగర్, లోక్యా తండా గ్రామాల్లోని విద్యార్థులకు వీధి కుక్కల నియంత్రణ, రేబీస్‌పై అవగాహన కల్పించారు. వీధుల్లో గుంపులుగా తిరిగే కుక్కలు చాలా ప్రమాదకరమని, విద్యార్థులు ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రమాదవశాత్తు కుక్క కరిస్తే వెంటనే సబ్బు రుద్ది చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కుక్క కాటును నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ల సలహాలు పాటించి టీకాలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు

నకిరేకల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుంటే రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక పెన్షన్‌ను పెంచుతామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి రెండేళ్లు కావొస్తున్నా హామీని నిలబెట్టుకోలేక పోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చి మేలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేశ్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

నల్లగొండ : రెడ్డి ఫౌండేషన్ గ్రో ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు అల్మాస్ ఫర్హీన్ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆపరేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, సాఫ్ట్‌స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైపింగ్, సెక్టర్ రీడ్‌నెస్, ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత 10 తరగతి, ఇంటర్, డిగ్రీ, పాస్ లేదా ఫెయిల్ అయిన వారు, 18ఏళ్ల నుంచి 30ఏళ్ల లోపు నిరుద్యోగులు సెప్టెంబర్ 15వ తేదీలోగా నల్లగొండలోని గడియారం సెంటర్‌లోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 70326 49925, 91777 85983 సంప్రదించాలని కోరారు.

గ్రూప్ 1 పరీక్ష అవినీతిపై విచారణ జరిపించాలి

రామగిరి(నల్లగొండ): గ్రూప్ 1 పరీక్షలో జరిగిన అవినీతి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం నిరుద్యోగులలతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాయ చెబుతూ నిరుద్యోగులను దగా చేస్తుందన్నారు. పరీక్షల్లో అక్రమాలు జరిగాయని హైకోర్టు చెప్పినా ప్రభుత్వం ఎలాంటి స్పందన లేదన్నారు. మయా మాటలు చెబుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలు మోసం చేస్తున్నారన్నారు. గ్రూప్ 1 పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయ్, నోముల క్రాంతి, కిరణ్‌కుమార్, వెంకట్, కృష్ణ, శ్రీకాంత్, రమేష్, యుగేందర్, నగేష్, లింగస్వామి, శ్రీశైలం, వర్షిత, రేణుక, అంజలి, శ్రీదేవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

రామగిరి(నల్లగొండ) : గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండలంలోని రాములబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఏఎన్‌సీ కేసులు, కుక్క కాటుకు యాంటి రేబిస్ వ్యాక్సినేషన్, మెడిసిన్, మలేరియా, డెంగీ పరీక్షల వివరాలు పరిశీలించారు. అనంతరం అప్పాజీపేటలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భాషా ఔన్నత్యాన్ని నిలబెట్టేది తెలుగు ఉపాధ్యాయులే..

గుర్రంపోడు : ఇంగ్లిష్ మీడియం అమలవుతున్న ఈ రోజుల్లో తెలుగు గొప్పతనాన్ని కాపాడేది తెలుగు ఉపాధ్యాయులేనని, తెలుగు భాషపై విద్యార్థులకు మక్కువ పెరిగేలా బోధన చేయాలని మండల విద్యాధికారి నోముల యాదగిరి సూచించారు. గురువారం కొప్పోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చండూరు, కనగల్, గుర్రంపోడు మండలాల తెలుగు టీచర్ల శిక్షణా సమావేశంలో మాట్లాడారు. చండూరు జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, జిల్లా రిసోర్స్ పర్సన్ మద్దోజు సుధీర్‌బాబు తెలుగు బోధనలో మెళకువలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా ఉత్తమ తెలుగు ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన రేగెట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నరాల శ్రీనివాసులును సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ సీతారం, యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి(నల్లగొండ) : ఎంజీ యూనివర్సిటీలో జరుగుతున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో ఎన్జీ కళాశాలకు చెందిన విద్యార్థుల ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన క్రీడాకారులు కబడ్డీ పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ గురువారం క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నర్సింగ్ కోటయ్య, డాక్టర్ బొజ్జ అనిల్, డాక్టర్ అంకష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

డిండి : మండలంలో గురువారం కురిసిన వర్షానికి మండలంలోని నిజాంనగర్ గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు కొట్టుక పోయింది. దీంతో నిజాంనగర్ నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగించేందుకు గ్రామస్తులు ఇబ్బందులకు గురయ్యారు. అదేవిధంగా మండలంలో కురిసిన వర్షానికి నగారాదుబ్బతండాలో కరంటోతు అచ్చికి సంబంధించిన ఇంటి పైకప్పు కూలింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. అనంతరం బాధితురాలి కుటుంబానికి 50 కేజీల బియ్యం, కూరగాయలు తహసీల్దార్‌కు అందజేశారు.

మాల్‌లో భారీ వర్షం

కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండల పరిధిలోని మాల్ లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో భారీ వర్షం కారణంగా వర్షపు నీరు రోడ్లపైకి చేరి రాకపోకలకు అంతరాయం నెలకొంది.



నగారా దుబ్బతండాలో కూలిన ఇంటి పైకప్పు



మట్టిరోడ్డు కొట్టుక పోకుండా చెట్ల కొమ్మలు అడ్డుగా వేస్తున్న గ్రామస్తులు

అల్పాహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులు

కొండమల్లేపల్లి : అల్పాహారం తిని 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాలలో చోటు చేసుకుంది. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సెమీ రెసిడెన్షియల్‌ను నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించారు. ఈ అల్పాహారంలో బొండాలను అందించగా ఇవి తిన్న 13 మంది విద్యార్థులు తీవ్ర కడుపునొప్పితో ఇబ్బందులు పడ్డారు. వెంటనే స్పందించిన పాఠశాల యాజమాన్యం విద్యార్థులను దేవరకొండలోని ఈ పాఠశాలకు చెందిన మెయిన్ బ్రాంచ్‌లో వైద్యుల చేత చికిత్స అందించారు. ఈ విషయంపై పాఠశాల యాజమాన్యాన్ని 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదించగా వారు స్పందించలేదు.